క్లుప్తంగా

హైస్కూల్ హెచ్ఎంకు సత్కారం



జగ్గంపేట హైసూల్‌లో హెచ్‌ఎం రంగరావును సత్కరిస్తున్న ఎన్జీవో సంఘాల నేతలు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం టీవీఎస్ రంగరావు కాకినాడ రూరల్ మండల ఎంఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన రెండు సంవత్సరాల్లో పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. దీంతో స్థానిక ఎన్జీఓ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల ఆవరణలో ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు. మండల విద్యాశాఖాధికారి బాధ్యతలతో పాటు జగ్గంపేట హెచ్ఎంగా ఆయన సేవలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్, క్యాండిల్ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జుత్తుక నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ల్యాబ్, టైం టేబుల్, తరగతి గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు నేర్పించాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్ఓ కె.జోగిరెడ్డి, ప్రిన్సిపాల్ బాలామణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



జగ్గంపేటలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం–3 ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. స్థానిక పద్మనాభ నగర్, శెట్టిబలిజపేట ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.48.6 లక్షలతో నిర్మించిన సచివాలయం–3 భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించినట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఈసీఈ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు విద్యార్థులు సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు.

రైతులు యంత్రాల వినియోగంపై దృష్టి సారించాలి

జగ్గంపేట: రైతులు వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన రైతు సంఘానికి 80 శాతం రాయితీతో మంజూరైన డ్రోన్‌ను బుధవారం జగ్గంపేటలోని క్యాంపు కార్యాలయంలో రైతులకు అందజేశారు. వ్యవసాయంలో యంత్రాల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్లేపల్లికి చెందిన శ్రీరామ్ కిసాన్ సీహెచ్‌సీ గ్రూపు సభ్యులు, వ్యవసాయశాఖ ఏడీ జి.శ్రీనివాస్, గండేపల్లి మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

జగ్గంపేట: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. జగ్గంపేట గురుకుల పాఠశాలలో పెద్దాపురం లలిత ఎంటర్‌ప్రైజెస్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్, పీఎంశ్రీ పథకం ద్వారా ఏర్పాటుచేసిన కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో లలిత ఎంటర్‌ప్రైజెస్ అధినేతలు మట్టే సత్య ప్రసాద్, శ్రీనివాస్, ఆదిశంకర్, పాఠశాల ప్రిన్సిపాల్ జీవీ లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆచూకీ లభ్యం

గండేపల్లి: అదృశ్యమైన వివాహితను గుర్తించి ఆమె తల్లికి అప్పగించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మండలంలోని సింగరంపాలేనికి చెందిన వివాహిత ఈ నెల 18న అదృశ్యమైంది. ఆ ఘటనపై ఆమె తల్లి పెదపూడి విజయకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యూవీ శివనాగబాబు ప్రత్యేక బృందాల ద్వారా దర్యాప్తు చేసి, ఆ వివాహిత హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు.

తీగలతో భయం.. భయం

- బెంబేలెత్తిస్తున్న విద్యుత్ వైర్లు
- లోఓల్టేజీతో ప్రజలకు ఇక్కట్లు
- ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు

తుని రూరల్: మండలంలోని కొలిమేరులో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రజలు, రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. పంట పొలాల్లో చేతికి అందే ఎత్తులో త్రీఫేజ్ లైన్ వైర్లు వేలాడుతుండగా, గ్రామంలో బ్రేకర్లు ధ్వంసమవ్వడంతో ఎప్పుడు జనావాసలపై పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లైన్‌మేన్, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసిన ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొలం పనులకు పాట్లు

గ్రామానికి చెందిన పాములోలితోట ప్రాంతంలో పూసపాటి పాదాలు బోరుకు వెళ్లే కరెంట్ తీగలు వేలాడుతున్నాయి. అధికారులకు రెండేళ్లుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. స్తంభానికి ఉన్న స్టేవైరు సరిచేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. విద్యుత్ వైర్లు వేలాడటం వల్ల పొలాల్లో పనులు చేసుకోవడం కష్టమవుతుందని, బిక్కుబిక్కుమంటూ పనులు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ తీగలు వేలాడుతుండటంతో దుక్కులు చేసేందుకు ట్రాక్టర్లు రావట్లేదని, పందిరి కూరగాయలు సాగు చేద్దామంటే కర్రలు పాతేందుకు కూలీలు రావట్లేదన్నారు. అధికారులు స్పందించి లైను వైర్లు వేలాడకుండా సరిచేయాలని రైతులు కోరుతున్నారు.



పంటపొలంలో విద్యుత్ స్తంభానికి చుట్టూ ప్రమాదకరంగా ఉన్న స్టేవైరు

గృహోపకరణాలు ధ్వంసం

గ్రామంలో లోఓల్టేజీతో ఫ్యాన్లు, ఇతర గృహ విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయి. వ్యవసాయ బోర్లకు వెళ్లే విద్యుత్ లైన్ ద్వారా గృహాలకు కనెక్షన్లు ఇవ్వటం వల్లే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రజలు నేరుగా, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసిన ప్పటికీ అధికారులు పట్టించుకోలేదని వైఎస్సార్ సీపీ నాయకుడు సాదు అప్పారావు ఆరోపించారు. విద్యుత్ స్తంభంపై బ్రేకర్ పగిలిపోయిందని, దాంతో విద్యుత్ వైర్లు ఎప్పుడు కిందకు పడి ప్రాణాపాయం కలుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రమాదం జరగకముందే ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



కొలిమేరులో బ్రేకర్ పగిలిపోవడంతో ప్రమాదకరంగా ఉన్న త్రీఫేజ్ లైన్

రెండేళ్లుగా ఇబ్బందులు

విద్యుత్ స్తంభానికి చుట్టూ ఉన్న స్టేవైరు బిగిస్తే సరిపోతోంది. ఈ సమస్య పరిష్కరించాలని రెండు సంవత్సరాలుగా అధికారులకు తెలియజేస్తున్నాము. విద్యుత్ తీగలు చేతికి అందే దిగువకు ఉండడతో పొలంలో పనులు చేయాలన్న భయపడాల్సి వస్తుంది.

– రెడ్డి శ్రీను, రైతు ,కొలిమేరు

ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదు

విద్యుత్ స్తంభంపై బ్రేకర్ పగిలిపోయింది. విద్యుత్ వైర్లు కింద పడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదు. సమస్య పరిష్కరించాలి.

– సాదు అప్పారావు,
వైఎస్సార్ సీపీ నాయకుడు, కోలిమేరు

జగన్‌ను కలసిన వైఎస్సార్ సీపీ నేతలు



మాజీ సీఎం జగన్‌తో చినబాబు, ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండలానికి చెందిన ఆ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీపీ లగుడు శ్రీనివాసు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

అన్నవరం: కత్తిపూడిలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి 63 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు అన్నవరం ఎస్సై శ్రీహరి బాబు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు. గెడ్డం రామ్ నవీన్ (కేఎల్ పురం, నర్సీపట్నం మండలం), మారి అలెక్స్ (నర్సీపట్నం), రౌతు మల్లేష్ (నర్సీపట్నం) గత జనవరిలో కత్తిపూడిలో దొంగతనాలకు పాల్పడ్డారు. వారిలో ఇద్దరిని కత్తిపూడి వద్ద బుధవారం అరెస్ట్ చేశారు. రౌతు మల్లేష్ ఇప్పటికే మరో కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్నాడు. అతడిని త్వరలో పీటీ వారెంట్ మీద అదుపులోకి తీసుకోనున్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి



కొత్త సూరవరంలో దాడిశెట్టి రాజాతో పార్టీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు మోసాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సూచించారు. కొత్త సూరవరంలో బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన 143 హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేశాడన్నారు. చంద్రబాబు మోసాలను, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి, ఇప్పుడు అప్పుల ఊబిలోకి ప్రజలను నెట్టివేస్తున్నారన్నారు. అనంతరం పార్టీ నాయకులు కూటమి వైఫల్యాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరోనా వంటి కష్టకాలంలో జగన్‌మోహన్‌రెడ్డి, తునిలో దాడిశెట్టి రాజా అందించిన సేవలు, వైద్య సదుపాయాలను తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఓడించడం, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా చంద్రబాబు నాయుడి మోసాలను ఎండగట్టాలన్నారు. వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీటీసీ వంగలపూడి అప్పారావు, నాయకులు వేముల శివనారాయణ, పైలా రాజు, మామిడాల బాబ్జి, నిట్ల నాగేశ్వరరావు, కోనా రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత సీట్లపై యాజమాన్యాలు నిర్లక్ష్యం

తుని: ప్రైవేటు పాటశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం కల్పించిన ఉచిత సీట్లపై యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరోగుల మోషే ఆరోపించారు. ఆ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సీట్లు మంజూరైన విద్యార్థులకు ఫోన్ చేయకుండా చేశామని, ఆదాయం ఎక్కువగా ఉందని తదితర అనేక రకాలుగా కొర్రీలు వేసి పేద పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోవడం లేదని తహసీల్దార్‌కు వివరించారు. తుని నియోజకవర్గంలో 300 మంది పిల్లలకు ఫ్రీ సీట్లు వస్తే కేవలం 140 మంది విద్యార్థులను మాత్రమే చేర్చుకున్నారన్నారు. మిగిలిన 160 సీట్లు రిజెక్టు అయిపోయాయని యాజమాన్యాలు చెబుతుండడం అత్యంత బాధాకరమన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు సైతం కొర్రీలు వేస్తున్న ప్రైవేటు పాఠశాలల యానమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి కుమార్, ముప్పిడి శ్యాంకుమార్, ఆరుగుల కృష్ణ, మోటుకూరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌లో వసతులు కల్పించాలంటూ నిరసన



రాజపూడి హైస్కూల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నేతలు

జగ్గంపేట: మండలంలోని రాజపూడి హైస్కూల్‌లో 600 మంది విద్యార్థులు ఉన్నా మౌలిక వసతులు కల్పించడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ అన్నారు. రాజపూడి హైస్కూల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో వసతులు కల్పించాలని కోరుతూ విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా విద్యారంగంలో సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. రాజపూడి ఉన్నత పాఠశాలలో తాగునీరు, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పించాలని ఫిర్యాదు చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాఠశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డాన్ శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్త విద్వత్ పరీక్షల్లో ఉత్తీర్ణత

అన్నవరం: స్థానిక సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు కాకినాడలోని వేద విజ్ఞాన ప్రతిష్ఠానం నిర్వహించిన స్మార్త విద్వత్ పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. దేవస్థానం స్మార్త ఆగమ పాఠశాలలో ఐదో సంవత్సరం స్మార్త విద్యనభ్యసిస్తున్న పది మంది విద్యార్థులు ఈ నెల 26న నిర్వహించిన పరీక్షలకు హాజరై అత్యుత్తమ ప్రతిభ కనబరచారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావడంతో వేద విజ్ఞాన ప్రతిష్ఠానం ప్రశంసా పత్రాలు అందజేసిందని స్మార్త ఆగమ పాఠశాల ప్రధాన అధ్యాపకులు లక్ష్మీనరసింహ మూర్తి తెలిపారు. విద్యార్థులను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు అభినందించారు.

ఎరువుల యాజమాన్యం కీలకం

ఏలేశ్వరం/కోటనందూరు/తునిరూరల్/గండేపల్లి/కిర్లంపూడి/శంఖవరం: వరిసాగులో ఎరువులు, సూక్ష్మపోషకాల యాజమాన్యం కీలకమని కోటనందూరు మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. అల్లిపూడి, కేఏ మల్లవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అదును పదును చూసి ఖరీఫ్ వరినాట్లు వేసుకోవాలని తుని రూరల్ మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. డి.పోలవరం, సుబ్రహ్మణ్యమ్మపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు వంద శాతం రాయితీపై అపరాల విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు పంటల బీమా నమోదు చేయించుకోవాలని ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ సూచించారు. ఏలేశ్వరం మండలంలోని పేరవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకరమైన నారుమడికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కిర్లంపూడి మండల వ్యవసాయ అధికారి సుధామాధురి సూచించారు. భూపాలపట్నంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది వరి నారుమడులను పరిశీలించారు. నారుమడి సంరక్షణ, నాట్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు గట్లపై వేసుకోవడానికి కంది విత్తనాలు పంపిణీ చేశారు. అంతర పంటలతో అదనపు ఆదాయం పొందవచ్చని శంఖవరం మండల వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. మండలంలోని ఎస్.జగ్గంపేటలో బుధవారం పొలంబడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్, అపరాల పంటల సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. గండేపల్లి మండలంలోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు సాగుపై అవగాహన కల్పించారు.

డెంగీ నివారణపై అవగాహన



గుమ్మళ్లదొడ్డిలో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో పీఎంపీ అసోసియేషన్ గోకవరం మండలం శాఖ ఆధ్వర్యంలో బుధవారం డెంగీ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఎక్కువగా డెంగీ వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రత, నిల్వ ఉన్న నీటిని తొలగించడం వంటి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరికైనా డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, సచివాలయం కార్యదర్శి పీవీ రమణకుమారి, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గంగాలమ్మకు వెండి శఠగోపం సమర్పణ



గంగాలమ్మ ఆలయ కమిటీ సభ్యులకు వెండి శఠగోపం అందజేస్తున్న దాత దంపతులు

గోకవరం: గ్రామ దేవత గంగాలమ్మకు బయన్నగూడేనికి చెందిన కంభంపాటి రవిబాబు, గీతా వరలక్ష్మి దంపతులు సుమారు రూ.30 వేల విలువ చేసే వెండి శఠగోపాన్ని సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు నాగులకొండ బాబా, సంగుల శివ, చిటికెల పాండు, ఏనుగు శ్రీను తదితరులకు బుధవారం శఠగోపాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

తుని రూరల్: మాదక ద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులు లేని సమాజ నిర్మాణానికి యువత మనో వికాసంతో ముందడుగు వేయాలని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆదేశాల మేరకు బుధవారం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుకు బానిసలైతే ఆర్థికంగా, మానసికంగా నష్టపోతారన్నారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించారు. కళాశాల, తుని ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, రద్దీ ప్రదేశాల్లో సంతకాలను సేకరించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ప్రోగ్రాం మెంబర్ డి.సరిత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

రౌతులపూడి: సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు విద్యార్థులంతా దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి.వెంకట అప్పారావు సూచించారు. మండలంలోని ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అసాంఘిక కార్యక్రమాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డ్రగ్ వలన కలిగే అనర్థాలను వివరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువత పెడత్రోవ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళల భద్రత, బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

శంఖవరం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు బుధవారం పూజలు నిర్వహించారు. మండలంలోని నెల్లిపూడి సిద్ధి వినాయక, బోడకొండమ్మ ఆలయాల్లో బుధవారం పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, వెలుగుల రవి ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిర్ల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు వెలుగుల ప్రసాద్, వెలుగుల నాగేశ్వరరావు, వెలుగులు చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లిపూడిలో సిద్ధివినాయక ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న జేసీ

తుని: స్థానిక ఈగలవారి వీధికి చెందిన బంగారు కుటుంబాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా దత్తత తీసుకున్నారు. పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకటరావుతో కలిసి బుధవారం ఆయన బంగారు కుటుంబాన్ని కలిశారు. కుటుంబ సభ్యులందరితో మాట్లాడి ఆర్థిక స్థితిగతులు, జీవన విధానం, పిల్లలు, వారి చదువులు తదితర అంశాలపై ఆరా తీశారు. అన్నివిధాలా అండగా ఉంటానని జేసీ వారికి భరోసా ఇచ్చారు.



తునిలో బంగారు కుటుంబంతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

సంక్షిప్తంగా..

పంట నరికివేతపై విచారణ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో నరికివేతకు గురైన అరటి, కొబ్బరి పంటలను బుధవారం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, స్థానిక సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం పరిశీలించారు. ఇ.గోకవరంలో తనకు, తన పంటకు నష్టం కలిగిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతు సత్తి వినోద్ కుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ మేరకు పోలీసులు ఇ.గోకవరం తరలివెళ్లి నరికివేతకు గురైన అరటి తోటలను, కొబ్బరి మొక్కలను పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతు సత్తి వినోద్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తన పంట, ఆస్తులకు రక్షణ కల్పించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో సతీ వియోగంతో బాధపడుతున్న బుద్ధరాజు రామకృష్ణరాజు కుటుంబాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు (మురళీరాజు) పరామర్శించారు. రామకృష్ణ భార్య రమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి రమణి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సీతారామరాజు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

అన్నవరం: నిబంధనలు అతిక్రమించిన ద్విచక్ర వాహనదారులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినట్టు అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు బుధవారం తెలిపారు. వారికి రవాణా చట్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసే వారికి లిఫ్ట్ ఇస్తే కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. రవాణా చట్టాలు ఉల్లంఘించిన వారికి జురిమానా విధించినట్టు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

ప్రత్తిపాడు: విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకూ జరిగే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కోరారు. ప్రత్తిపాడులో బుధవారం సాయంత్రం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యపరచేందుకు విశాఖ వేదిక కానుందన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానానికి స్వస్తి పలికి కార్మిక రాజ్యాన్ని స్థాపించడమే సీఐటీయూ లక్ష్యమన్నారు. ప్రభుత్వ స్కీమ్‌లో పనిచేసే స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు నిట్ల శ్రీను, అల్లాడి లక్ష్మి, సీహెచ్ వరలక్ష్మి, లోవ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు

గోకవరం: మండలంలోని ఇంటికాయలపల్లిలో బుధవారం ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధారా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలందరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. టీబీ నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రతిజ్ఞ చేయించారు. 98 మందిని పరీక్షించి 17 మంది నుంచి కళ్లె పరీక్షకు శాంపిల్ సేకరించారు. అనంతరం స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు టీబీ లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తుని: హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్లో ఈ నెల 26 నుంచి 29 వరకూ నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్–7 వాలీబాల్ పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–14 విభాగంలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించినట్టు విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తెలిపారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్‌లు విజయ్, దుర్గాప్రసాద్, విజేతలను అభినందించారు.

రౌతులపూడి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కుమార్

రౌతులపూడి: రౌతులపూడి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ప్రత్తిపాడు ఎంపీడీఓ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య శిక్షణా తరగతులకు వెళ్లారు. నూతన ఎంపీడీఓ కుమార్ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, గ్రామాల అభివృద్ధి పలు సూచనలు చేశారు.

తీర ప్రాంతంలో సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుకు కృషి

తొండంగి: తీరప్రాంతంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. మండలంలోని వేమవరంలో ఓ ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన సోలార్ ప్లాంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీలపై తీరప్రాంతంలో సోలార్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు తీరప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి సాయం

కిర్లంపూడి: గ్రామానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ పసుపులేటి వెంకన్నబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ప్రత్తిపాడు ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు కిర్లంపూడిలోని వెంకన్నబాబు స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు సలాది కృష్ణ, కార్యవర్గ సభ్యులు యాళ్ల తాతాజీ, గుత్తుల వీరరాఘవ, చేవల శ్రీనివాసరావు, నామన వెంకట భాస్కర్ ఉన్నారు.